జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



గురువారం | 5-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 184 పేజీలు: 8 వెల : రూ.7





# అల్లుకున్న.. అభిమానం

- ✳ థియేటర్ల వద్ద పుష్ప-2 ఫ్లెక్సీలు
- ✳ ప్రీమియర్ షోకు తరలివచ్చిన అభిమానులు
- ✳ బాణసంచా కాల్చి హడావిడి
- ✳ సోంపేటలో పుష్ప ఫ్లెక్సీలో జగన్ ఫొటో

**శ్రీకాకుళం, డిసెంబర్ 4 (వార్త):** ప్రపంచ వ్యాప్తంగా 'పుష్ప-2' సినిమా ప్రీమియర్ షోతో బుధవారం రాత్రి 9.30 గంటలకు విడుదలైంది. ఒక్కో టిక్కెట్ రూ.900లు పలికినప్పటికీ కొనుగోలు చేసేందుకు అభిమానులు పోటీపడ్డారు. థియేటర్ల వద్ద అభిమానులతో సందడి నెలకొంది. సినిమా రిలీజ్‌కుముందు అభిమానులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. డప్పు మోతలతో థియేటర్లు మారుమోగాయి. అల్లు అర్జున్ ఫ్యాన్స్ శ్రీకాకుళం నగరంతో పాటు జిల్లాలోని అన్ని సినిమా థియేటర్ల వద్ద పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రణస్థలంలోని రామాంజనేయ థియేటర్ ముందు భాగాన అల్లు అభిమానులు తమ ఫ్లెక్సీలతో నింపేశారు. కాగా, సోంపేట ఎస్ఎస్ మాక్స్ వద్ద అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫోటోలు ప్రత్యేకతను సంతరించుచున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు తమ ప్రత్యేకమైన అభిమానాన్ని ఈ ఫ్లెక్సీల ద్వారా చాటుకున్నారు. అల్లు అభిమానుల వల్ల ఫ్లెక్సీ ప్రింటర్లకు చేతినిండా పని దొరికింది.









# రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

- ✳ భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించండి
- ✳ గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేయండి
- ✳ రెవెన్యూ శాఖ మంత్రి సత్య ప్రసాద్
- ✳ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జేసీ, డీఆర్వో







**శ్రీకాకుళం, డిసెంబర్4 (వార్త):** భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాని రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ కలెక్టర్లకు సూచించారు. బుధవారం విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులతో సెదస్సుల నిర్వహణ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు హాజరైయ్యారు. జిల్లాలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల ఏర్పాట్లపై రెవెన్యూ మంత్రి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని, అధిక సంఖ్యలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 1464 రెవెన్యూ గ్రామాలున్నాయని, అందులో 738 రీసర్వే పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. సదస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి మంత్రులను ఆహ్వానించామన్నారు. గ్రామాల్లో నిర్వహించే సదస్సులకు సంబంధించి ముందస్తు ప్రచారం నిమిత్తం కరపత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ ఎ.ఓ సూర్యనారాయణ, సెక్షన్ అధికారులు సిబ్బంది హాజరైయ్యారు.

# ప్రాపర్టీ కేసులు ఛేదించండి

- ✳ బహిరంగ ప్రదేశాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి సారించాలి
- ✳ వాహన తనిఖీలు పెంచండి
- ✳ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 4 (వార్త):** సమగ్ర దర్యాప్తుతో ప్రాపర్టీ కేసులు త్వరితగతిన ఛేదించి, కేసు ప్రాపర్టీ రికవరీ చేయాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వర్చువల్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో లోక్ అదాలత్ కేసులు, ఎస్సీ, ఎస్టీ, ఫోక్సో కేసులు, క్రైమ్ అగైనస్ట్ ఉమెన్, ప్రాపర్టీ, ఎన్ఫోర్స్మెంట్ కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 14న జరిగే లోక్ అదాలత్‌లో రాజీ పడేందుకు అవకాశం ఉన్న ఎక్కువ కేసులు డిస్పోజ్ అయ్యే విధంగా ఇప్పటి నుండే ప్రణాళికతోపని చేయాలన్నారు. క్రైమ్ అగైనస్ట్ ఉమెన్, ఫోక్సో, ఎస్సీ ఎస్టీ, ప్రాపర్టీ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు, ముద్దాయిల అరెస్టు మొదలైన అంశాలు గూర్చి ఆరా తీశారు. అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పురోగతి సాధించాలని, ప్రతి పోలీస్ స్టేషన్లో లాస్ట్ ప్రాపర్టీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ ఎస్టీ, ఫాక్సో కేసుల్లో 60 రోజుల్లోగా అభియోగ పత్రాలు దాఖలు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఎన్ఫోర్సుమెంటు కేసులను పెంచాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన, జూదం ఆడిన, నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం


## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

**లావేరు, డిసెంబర్ 4(వార్త):** వెంకటాపురం పంచాయతీకి చెందిన పొట్నూరు అనురాధకు ఐదు లక్షల 33 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బుధవారం లావేరులో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో అత్యవసర వైద్యం కోసం అప్పుచేసి ఇబ్బందులు పడుతున్న పేదల కోసం కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిలుస్తుందని అన్నారు.



# టిడ్కో లబ్ధిదారులూ..ఆందోళన చెందొద్దు

**పలాస, డిసెంబర్4(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అర్బన్ హౌసింగ్ గ్రీవెన్స్‌లో పురం, బొడ్డపాడు-2, తర్లకోట అర్బన్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు టిడ్కో ఇళ్ల కేటాయింపులకు సంబంధించి పలు దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా అర్బన్ లేఅవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు, ఇసుక వంటి సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. 12 దరఖాస్తులు రాగా, వివిధ శాఖాధికారులతో స్వయంగా మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు మాట్లాడి, వీటిని పరిష్కరించాలని సూచించారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా రావాల్సి ఉందని, దీంతో సొమ్ము డిపాజిట్ చేసిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అర్బన్ హౌసింగ్‌కి సంబంధించి లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల్లో ఏ సమస్యలు ఉన్నా తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



# భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడి పూజ



**పలాస, డిసెంబర్ 4(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ, మూడో వార్డు పద్మనాభపురంలో వెలసిన దత్త అయ్యప్ప దేవాలయంలో కొండే నరసింహ, పార్వతీశం సంయుక్తంగా నడిపిస్తున్న సన్నిధానంలో బుధవారం పడి పూజ ఘనంగా జరిగింది.

తొలుత గురు స్వా ములు అప్పయ్యస్వాములతో పూజలు చేయించారు. భక్తిశ్రద్ధలతో భజన చేసి పడి వెలిగించారు.

అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిపారు. అనంతరం స్వాములంతా కలిసి ఊరే గింపుగా బయలుదేరి పద్మనాభపురం చెరువు వద్ద జ్యోతిని నిమగ్నం చేశారు,

ఈ కార్యక్రమంలో గణపఅప్పారావు, పులారి రంగస్వామి, బతకల సత్యనారా యణ, బతకల పులిరాజు, దుబ్బ రాజ గోపాల్, కొండే యుగంధర్, చిన్న, పులారి పాపారావు, సారా గోవిందు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**శ్రీకాకుళం, డిసెంబర్4(వార్త):** అఖిల భారత యువజన సమాఖ్య( ఏఐ వైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభలు శ్రీకా కుళంలో 6,7,8,9 తేదీల్లో నిర్వహి స్తామని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్య దర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధా న కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు తెలి పారు. బుధవారం వారు టెక్కలిలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంత రం వారు మాట్లాడుతూ దేశంలో నిరు ద్యోగ సమస్య పేరుకుపోయిందని, యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమ ర్శించారు. యువజన హక్కుల సాధ నకు ఏఐవైఎఫ్ నిర్విరామంగా కృషి చేస్తుందన్నారు. దేశ భవిష్యత్‌ను తీర్చి దిద్దడంలో యువత పాత్ర అత్యంత కీలకమైందన్నారు. అందరికీ విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని వారు ఆరోపించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జిల్లా ప్రజలు విజయవం తం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కిరణ్, చందు, శ్యామ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



## బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**మెళియపుట్టి, డిసెంబర్ 4 (వార్త):** ఒరిస్సా ప్రాంతం, పర్లాకిమిడి వెళ్లే రోడ్డు మార్గంలో దవిడిగాం గ్రామం సరిహద్దు ప్రాంతంలో బస్సు ఢీకొని గొట్టిపల్లి సామేలు (65) అక్కడికక్కడే మృతిచెందగా సోనాపురం గంగాధర్ (52) అనే యువకునికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మెళియాపుట్టి మండలం కొసమాల గ్రామానికి చెందిన గొట్టిపల్లి సామేలు, సోనాపురం గంగాధర్ బుధవారం ద్విచక్ర వాహనంపై పర్లాకిమిడి వెళుతుండగా దవిడిగాం దాటిన తర్వాత వెనుక వైపు నుండి వచ్చిన ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో గొట్టిపల్లి సామేలు అక్కడిక్కడే మృతి చెందగా, గంగాధర్‌కు గాయాలయ్యాయి. మృతి చెందిన సామేలుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



## నాస్ పరీక్షలు విద్యార్థులకు ఎంతో కీలకం

**మందస, డిసెంబర్ 4 (వార్త):** జాతీయ అచివ్మెంట్ సర్వే(నాస్) పరీక్షలు విద్యార్థులకు ఎంతో కీలకమని ఎంఈవో ఎం.లక్ష్మణరావు అన్నారు. సింగుపురంలో గల ఎంపీపీ స్కూల్, మందసలోని ఎస్.ఆర్.ఎస్.ఎం. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నాస్ పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి ప్రతిభా పాటవాల వెలికితీతకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఆరో తరగతి విద్యార్థులు 28మంది, మూడో తరగతి విద్యార్థులు 18 మంది పరీక్ష రాశారని తెలిపారు. హెచ్ఎం రవికుమార్, వమరవెల్లి డైట్ నుంచి అబ్జర్వర్ ఈశ్వరరావు, బిందుశ్రీ, మాధురి పాల్గొన్నారు.

## కిల్లంశెట్టి నరేష్ దాతృత్వం



**మందస, డిసెంబర్ 4 (వార్త):** మందసలోని పొందరవీధికి చెందిన పొందర ధనుష్ హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో దాతలు ఆదు కుంటున్నారు. మేము సైతం అంటూ తోచినంత ఆర్థికసాయం అందిస్తున్నారు. మందసకు చెందిన సోషల్‌వర్కర్ కిల్లంశెట్టి నరేష్.. రూ.10వేలు అందివ్వడానికి ముందుకు వచ్చారు. నరేష్‌ను స్థానికులు అభినందించారు.

## నేడు మందసలో ఎమ్మెల్యే శిరీష పర్యటన

**మందస, డిసెంబర్ 4 (వార్త):** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఈనెల 5న మందసలో పర్యటించనున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు భైరిసారంగపురం చేరుకుంటారన్నారు. అనంతరం బెల్లుపట్టియ, సువర్ణాపురం, బహడపల్లి గ్రామాల్లో పర్యటిస్తారని చెప్పారు.

## న్యాయ సేవలపై సమీక్ష

**శ్రీకాకుళం, డిసెంబర్ 4(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు బుధవారం స్థానిక జిల్లా న్యాయ సేవా సదనం నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. నవంబర్‌లో జరిగిన కార్యకలాపాలపై చర్చించారు. తగు సేవలు ప్రజలకు అందించాలని సూచించారు. జిల్లా జైలులోని ముద్దాయిలకు బెయిల్ పిటిషన్లను త్వరగా మంజూరు చేయాలని తెలిపారు. న్యూ ఇండియా ఎస్యురెన్స్ కంపెనీ లిమిటెడ్ వారి రెండు కేసులను రాజీ చేశారు. లోక్ అదాలత్‌ను న్యాయవాదులు, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు

## విశాలాంధ్రతో విజ్ఞానం



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 4(వార్త):** ఎంతో మంది పుస్తక పఠన ప్రియులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అందుబాటులోకి తెస్తుందని, మారుతున్న సాంకేతిక రంగంతో పోటీ పడుతూనే పాఠకుల అభిరుచులకు అనుగుణంగా ప్రచురణలు నిరంతరంగా చేస్తుండటం గర్వకారణమని మున్సిపల్ కమిషనర్ ఎన్ రమేష్ అన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంచార పుస్తక విక్రయ వాహన కేంద్రాన్ని బుధవారం ఉదయం న్యాయవాది నాగరాజ్ పాత్రో తో కలిసి ప్రారంభించారు. ఆయనకు పుస్తక కేంద్రం ఇన్చార్జి నషీర్ పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతించారు. పాఠకులకు పుస్తకాలను అందుబాటులో ఉంచటం భారమైన సంచార కేంద్రం ద్వారా సేవలు అందిస్తున్న విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సేవలు గొప్పవని కమిషనర్ ప్రశంసించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**ఆమదాలవలస, డిసెంబరు 4(వార్త):** ఆమదాలవలస మండలంలోని నిమ్మతొర్లాడ గ్రామానికి చెందిన పట్టా సూర్యనారాయణ అనే టీడీపీ కార్యకర్త అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సూర్యనారాయణ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్టు తెలుసుకున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈవిషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.12 లక్షలను మంజూరు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే రవికుమార్ బుధవారం హైదరాబాద్ వెళ్లి ఆ కుటుంబ సభ్యులకు నిధుల మంజూరు పత్రాలు అందించారు. ఆ కుటుంబీకులు ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



## రైతుల సంక్షేమానికి ఎన్డీయే కట్టుబడి ఉంది

**ఎచ్చెర్ల, డిసెంబర్ 4(వార్త):** ఇబ్రహీంబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్న ఏకైక ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలోనిదన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.






## జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన గ్రీష్మ

**వంగర, డిసెంబర్4(వార్త):** విజయనగరంజిల్లా ఇన్చార్జి ,రాష్ట్రహోమ్ మంత్రి వంగల పూడిఅనితను ఆమె ఆంధ్ర ప్రదేశ్ మహిళా కోర్పరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ కావలి గ్రీష్మ కలిశారు. బుధవారం నాడు ఈమె మంత్రి అనిత ను ఆమె స్వగృహం విజయవాడలో కలిశారు. విజయనగరంజిల్లా ఇన్చార్జిమంత్రివర్యులు వంగలపూడి అనితను విజయవాడలోని వారి స్వగృహంలో కలసి రాష్ట్రంలో మహిళల భద్రతా మరియు అభివృద్ధి కోసం చర్చించడం జరిగినది. ఈ మేరకు గ్రీష్మ ఈ విషయాన్ని వెల్లడించారు.

## రోణంకికి ఘన స్వాగతం



**నరసన్నపేట, డిసెంబర్4(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన రో నంకి కృష్ణం నాయుడు నరసన్నపేట పట్టణంలో అడుగుపెట్టిన సందర్భంగా, నరసన్నపేట కాళింగ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ప్రముఖ వైద్యులు బలగ మురళి. మార్పు విజయ్ కుమార్. అధ్యక్షులు ఉప్పాడ పూర్ణ రావు. ఉపాధ్యక్షులు సింగూరు శ్రీనివాసరావు పిలుపుమేరకు నరసన్నపేట కాలింగ కుటుంబ సభ్యులందరూ నరసన్నపేట పైడితల్లమ్మ గుడి వద్ద భారీ జన సందోహంతో మంగళ వాయిద్యాలతో ఆహ్వానించి పైడితల్లమ్మకు పూజలు చేసిఆయన ఇంటి వరకు బైక్ ర్యాలీతో ఘనంగా స్వాగతించారు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ నాకు ఇంతగా గౌరవించిన కుటుంబ సభ్యులందరికీ మనసు పూర్తిగా ధన్యవాదములు తెలియజేశారు ఈ కార్యక్రమానికి నరసన్నపేట కాలింగ్ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మరియు కోర్ కమిటీ సభ్యులు మరియు కాలింగ కుటుంబ సభ్యులందరూ భారీగా పాల్గొని ర్యాలీని జయప్రదం చేశారు

## క్రీడా విద్యార్థినిలకు అభినందనలు

**ఎచ్చెర్ల, డిసెంబర్4(వార్త):** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(గుంటూరు)లో నవంబర్ 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ జరిగిన సౌత్-వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనపరిచిన ముగ్గురు క్రీడాకారిణిలకు డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని, రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య తదితరులు బుధవారం అభినందించారు. 'వర్సిటీ చరిత్రలోనే తొలిసారి వెయిట్ లిఫ్టింగ్ కేటగిరిలో బంగార పతకం సాధించిన డి. హేమశ్రీ(విద్యాధరి డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం)కు ప్రత్యేకంగా ప్రశంసించారు. అదేవిధంగా హేమశ్రీతో పాటు హిమచల్ ప్రదేశ్ లో త్వరలో జరగనున్న జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన జి. వర్షిత( శారద డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం), ఎస్. ఝాన్సీరాణి(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి)లకు కూడా అభినందనలు తెలిపి వర్సిటీ విశిష్టతను మరింతగా చాటిచెప్పాలని వీసీ సూచించారు. కాగా, వీరంతా డా.బిఆర్ఏయూ తరుపున వెయిట్ లిఫ్టింగ్ బృందంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో "వర్సిటీ స్పోర్ట్స్ డీన్ డా. పి.రవికుమార్, పీడీ డా. ఎం. శ్రీనువాస్, డా. ఎ.భాస్కర్, డిఎస్ఎ కోచ్ ఐ.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



# రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

**వంగర, డిసెంబర్ 4 (వార్త):** కోదులగుమ్మడ గ్రామ సమీపాన గల మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు బుధవారం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రకాష్‌రావు, అప్పలనాయుడుకు తీవ్ర గాయాలు కాగా, అదే దారిలో వెళ్తున్న వారు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో 108 సిబ్బంది జగదీష్, విభీషణ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స అందజేసి, వారిని పార్వతీపురం లోని ప్రైవేట్ హాస్పిటల్లో జాయిన్ చేశారు. చికిత్స అనంతరం ఇరువురికి ప్రాణాపాయం తప్పిందని హాస్పిటల్ సిబ్బంది తెలిపారు.





# విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తం



**రాజాం, డిసెంబర్ 4(వార్త):** జిల్లాలోని వీఐపీల భద్రతా విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి పునశ్చరణ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ శిక్షణకు ఆర్మ్‌డ్ రిజర్వు అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు.

వ్యక్తిగత భద్రత విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తతతో ఉండాలన్నారు. సిబ్బందిని శారీరక దారుఢ్యం, వృత్తి నైపుణ్యం ఉత్తమంగా నిలుపుతుందన్నారు.

ఈ శిక్షణలో పోలీసు సిబ్బందిలో శారీరక దారుఢ్యం పెంపొంచేందుకు, వీఐపీ సెక్యూరిటీలో నిర్వహించాల్సిన విధులు, తీసుకోవా ల్సిన జాగ్రత్తలు, ఫైరింగు ప్రాక్టీసు, విఐపి భద్రత విధుల నిర్వహణలో ఏమి చెయ్యాలి, ఏమి చెయ్యకూడదన్న అంశాలు, బాంబ్ డిస్పోజల్ విధులపై పునశ్చరణ తరగతులను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పునశ్చరణ తరగతులను వ్యక్తిగత భద్రత విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది సద్వినియోగం చేసుకొని, తమ వృత్తి నైపుణ్యాన్ని, శారీరక సామ ర్థ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐ సెక్యూరిటీ శ్రీనివాసరావు, అడ్మిన్ ఆర్ ఎన్.గోపాల నాయుడు, ఎంటీ ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, ఆర్ఎస్ఐలు రామారావు, రామకృష్ణ, ముబారక్ అలీ, వర ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# హిందువుల సమైక్య ర్యాలీ విజయవంతం



**శ్రీకాకుళం, డిసెంబర్ 4(వార్త):** బంగ్లాదేశ్ లో హిందువులు మైనార్టీ ప్రజలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బుధవారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో హిందూ సమాజం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ జరిగింది. జిల్లా పరిషత్ మొదలుకొని కలెక్టర్ కార్యాలయం వరకు హిందువులు అందరూ.. నినాదాలు చేస్తూ ర్యాలీ తీసి అనంతరం కలెక్టర్ వారి ద్వారా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారికి రాసిన మేమోరాండం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హిందూ సమాజం తరుపున పారానంది వెంకట రమణ మూర్తి మీడియాను ఉద్దేశించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బుధవారం పెద్ద ఎత్తున హిందువులు నిరసన, ధర్నాలు చేశారు. బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాసులును వెంటనే ఆపాలని లేకుంటే హిందూ సమాజం వారికి తగిన బుద్ధి చెబుతుందని వ్యాఖ్యానించారు. అలాగే దుంగ రమణ మూర్తి గారు మాట్లాడుతూ... పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ విడిపోయినప్పటి నుండి నేటి వరకు భారత్ అనేక విధాలుగా ఆర్థికంగా సహకరిస్తూ వచ్చింది. వేలాది కోట్లు సాయం చేసింది. వారికి ప్రత్యేక దేశం ఏర్పాటు చేయడంలో ఎందరో భారతీయులు అనేక త్యాగాలు చేశారు అలాంటిది హిందువులపై ఇలాంటి పిరికిబంద చర్యలు వారికి తగదని ఆయన హితవు పలికారు. బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఢాకాలోని తంతియాలో పూజా మండపం పై దాడులు చేసారు. జేశోరేశ్వరీ కాళీ మాత ఆలయంలో కిరీటం అపహరించారు. ఇలాంటి చర్యలు హిందువుల మనోభావాలు దెబ్బతీసేవిగా భారతీయ హిందూ సమాజం ఆందోళన చెందుతోంది అని అన్నారు. భారత ప్రభుత్వం బంగ్లాదేశ్ ప్రభుత్వానికి ఇప్పటికే స్పష్టం చేసింది. బంగ్లాదేశ్ లో ఉన్న హిందువులుతో పాటు మైనార్టీలు, ప్రజలు అందరినీ సంరక్షించాల్సిన బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పడం జరిగింది అని బిర్లంగి గుర్తు చేశారు. ఈ సమావేశంలో లోకనాదం, లింగరాజు, మాధవ్, పద్మజ , పూడి తిరుపతి రావు, పైడి వేణుగోపాల, శవ్వన ఉమామహేశ్వరి, గోపీ, సూర్యకుమారి, రాజేశ్వరి, లక్ష్మీనారాయణ, కిరణ్, ఉమామహేశ్వరి రెడ్డి, మధుసూదన్, పెద్ద ఎత్తున హిందూ బందువులు తదితరులు పాల్గొన్నారు




జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బహిరంగ మద్యపానం.. నిందితుడికి 14 రోజుల జైలు శిక్ష

**శ్రీకాకుళం, డిసెంబర్ 4(వార్త):** బహిరంగంగా మద్యం సేవించి గలాట సృష్టించిన ఓ వ్యక్తికి శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి 14 రోజుల జైలు శిక్ష విధించారు. బుధవారం శ్రీకాకుళం వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో కంద్ర విధికి చెందిన బొమ్మలాట హరికృష్ణ (రౌడీ షీటర్) బహిరంగంగా మద్యం సేవించడంతో పాటు, ప్రజలతో ఇబ్బందికరంగా ప్రవర్తించి, గొడవ చేయడంతో సదరు వ్యక్తిపై శ్రీకాకుళం వన్ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ఈ కేసును విచారించిన శ్రీకాకుళం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి శివరామకృష్ణ.. నిందితుడికి 14 రోజుల జైలు శిక్ష విధించారు. బహిరంగంగా మద్యం సేవించి, గొడవ చేసే వారిపైన, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి హెచ్చరించారు.

## వికలాంగులను ఆదుకోండి



**శ్రీకాకుళం, డిసెంబర్ 4(వార్త):** వికలాంగులను ఆదుకోవాలని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి డా.వీరేంద్రకుమార్‌కి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విన్నవించారు. కేంద్రం వారికి అందిస్తున్న పథకాల్లో భాగంగా శిబిరాలు నిర్వహించి, వారికి కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్ వంటి సహాయక పరికరాలను అందించాలని కోరారు. దీంతో వైకల్యంతో బాధపడుతున్న వారు మెరుగైన జీవితాన్ని గడపగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో ఈ పథకాన్ని విస్తృతంగా అమలు చేసి, శారీరక వైకల్యం ఉన్న వారికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

## మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్, సైబర్ నేరాలపై అవగాహన





**శ్రీకాకుళం, డిసెంబర్ 4(వార్త):** విద్యార్థి దశ నుంచే మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు సంకల్పం పేరుతో పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని రెండవ పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ సంతోష్ తెలిపారు. శ్రీకాకుళం పట్టణంలోని బలగ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులతో సంకల్పం కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలలో విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని అందులో భాగంగా బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ప్రధానంగా మాదకద్రవ్యాల వాడకం వాటి వల్ల కలిగే అనర్ధాలు అంతేకాకుండా ర్యాగింగ్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ఈ విధంగా విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని , అన్నారు. దీంతోపాటు ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు కూడా దీనిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని వారి పాత్ర కూడా ముఖ్యమని పోలీసు వ్యవస్థతో వారు కూడా సహకరించాలని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లోనైనా ఇబ్బంది కలిగించే పరిస్థితి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సమాజంలో ఇటువంటి వాటిని దూరంగా ఉంచేందుకు అందరు సహకరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యార్థితో పాటు ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు 30..ఉపాధ్యాయుడు ఒక్కరే

### -ఇదీ మెట్ట మగ్గూరు ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల దుస్థితి

**వంగర, డిసెంబర్ 4 (వార్త):** వంగర మండలంలోని మగ్గూరు ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులు 30 ఉన్నారు. ఇంత మంది విద్యార్థులు ఉన్నప్పటకీ ఉపాధ్యాయుడు మాత్రం ఒక్కరే ఉన్న ప్పటికీ ఒకే టీచర్ తో గత కొన్ని నెలలుగా పాఠశాల నడుస్తుంది.ఇంత మంది విద్యార్థులున్న పాఠశాలకు ఒక్క ఉపాధ్యా యుని వల్ల విద్యార్దులకు విద్యానందించటం ఎలా సాధ్య పడుతుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. విద్యను అందించటం మన్నది ఏ విధంగా సాధ్య పడుతుందో తెలపాలని, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్థులు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఈపాఠశాలకు ఇరువురు ఉపాధ్యాయులు ఉండేవారు.ఇటీవల అందులో ఒకటీచర్ హఠాత్ గా మరణించారు.ఆయన మరణించి నెలలు గడుస్తున్నప్పటకీ మరో టీచర్ ను నియమించవలసి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మూడు నెలలుగా ఒక్కటీచర్ తోనే పాఠశాల నడుస్తుంది.ఈఒక్క ఉపాధ్యాయుడు ఇటు విద్యార్థులను కంట్రోల్ చేసేసరికి సమయం సరిపోతుందే తప్ప ఐదు తరగతులు విద్యార్థులకు విద్యను అందించేదెలానని సంబంధిత అధికారులే చెప్పాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. మెట్ట మగ్గూరు గ్రామప్రజలు వెంటనేమరో టీచర్ ను నియమించాలని మండల విద్యాశాఖాధికారినికోరుతున్నప్పటకీ, జిల్లావిద్యాశాఖాదికారికి ప్రతి పాదనలు పంపించామని నెలలుగా చెబుతున్నారేతప్ప,ఈపాఠశాల,విద్యార్థులనుపట్టించుకోవటం లేదని మెట్టమగ్గూ రు గ్రామ ప్రజలు మండిపడుతున్నారు . ఈ గ్రామం మద్దువలస ముంపునకు గురైన



నూతనంగా నూతనంగా నిర్మించిన నిర్వాసిత గ్రామం, సంబంధిత జిల్లా అధికారులు కల్పించుకొని విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఈ స్కూల్ కి మరోటీచర్ నునియమించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్ తో ఆటలాడుకొంటున్నారని,ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెల్ల నున్నట్లు విద్యార్థులు తల్లి తండ్రులు తెలిపారు. అవసరం లేని పాఠశాలల్లో అధికంగా టీచర్లున్నారనీ,అవసరమైన పాఠశాలల కు ఉపాధ్యాయుల కొరత వెంటాడు తుందన్న ఆరోపణలున్నాయి. 1వ తరగతి నుండి 5 వతరగతి వరకూ ఉన్న విద్యార్థులకు ఒకే టీచర్ తో విద్యాభ్యాసం ఎలా సాధ్య పడుతుందని సంబంధిత అధికారులే తెలియ జేయాలని గ్రామస్థులు అధికార్లను డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా తక్షణమే ఇంకో టీచర్ని నియమించాలని నిర్వాసిక ముగ్గురు గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరు తున్నారు.

## నౌపడలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు



**సంతబొమ్మాళి, డిసెంబర్ 4 (వార్త):** డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి చేస్తున్న కృషిలో భాగంగా మండలంలో నౌపడ పంచాయతీ పరిధిలో గల కిరాణా, పాన్ షాపులలో నౌపడ ఎస్సై నారాయణస్వామి నేతృత్వంలో బుధవారం నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. నౌపడ, సీతానగరం, మూడు రోడ్ల జంక్షన్ షాపులకు వెళ్లి స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు చేస్తూ వ్యాపారస్తులకు హెచ్చరికలు జారీ చేశారు. మాదకద్రవ్యాలు అమ్మటం కొనటం చట్టరీత్యా నేరమని నిబంధన అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి డ్రగ్స్ సేవించే, రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే సాయంత్రం జగన్నాథపురం గ్రామంలో సైబర్ నేరాలు మాదకద్రవ్యాల వినియోగంపై యువతకు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడి ఎంతోమంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమాలలో ఏఎస్ఐ శ్రీరామమూర్తి, సిబ్బంది ఉన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**మందస, డిసెంబర్ 4 (వార్త):** మందసలో ధాన్యం కొనుగోలు కేంద్రా న్ని బుధవారం సచివాలయం ఆవరణ లోని రైతుభరోసా కేంద్రం వద్ద తహసీ ల్దార్ ఎస్.హైమావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 13 క్లస్టర్ల పరిధిలోని రైతుల ధాన్యాన్ని కేజీ రూ.23 చొప్పున ప్రభుత్వం కొను గోలు చేస్తుందన్నారు. మండలంలోని మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు సత్వరమే చేపట్టాలని సూచించారు. కార్యక్రమం లో వ్యవసాయ అధికారి జి.నాగరాజు, ఏఈవోలు పుస్యా ఉదయ్‌కుమార్, బల్లు జగ్గారావు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతా రావు, బాలిగాం కోఆపరేటివ్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు బమ్మిడి కర్రెయ్య, మందస పంచాయతీ మాజీ సర్పంచ్ డుంకురు తిరుపతి, హంసరాలి మాజీ సర్పంచ్ తమిరి భాస్కరరావు, పిడి మందస ఎంపీటీసీ సభ్యుడు వాయిల పల్లి మాధవరావు, బైరిశెట్టి గున్నయ్య, రాజాన మహేష్, మంగళ పాత్రో, ప్రకాష్ పాణిగ్రాహి, పల్లి చంద్రయ్య, కొర్రాయి శ్రీను, నారాయణరావు, రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 4(వార్త):** ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిబంది అయిన వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్,డేటా ఎంట్రీ ఆపరేటర్లతో, రైస్ మిల్లర్స్ తో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమం లో వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్ మోహన్ రావు , సి ఎస్ డి టి సంతోష్ వ్యవసాయ అధికారి - భార్గవి పాల్గొన్నారు. జగన్ మోహన్ రావు సిబంది కి ధాన్యం కోనుగోలు సమయం లో పాటించ వలసిన జాగ్రత్తలు, అలాగె కావల్సిన స్టేషనరీ, ప్రింటింగ్ సౌలభ్యం, జీపీఎస్ డివైస్ వాహనాలకు అమర్చుట మొదలగు అంశాలు పరిశీలించి. దానికి కావలసిన ఏర్పాటు చేశారు, రేపు ఇచ్ఛాపురం లో జీపీఎస్ డివైస్ వాహనాలకు అమర్చటానికి టెక్నీషియన్స్ వస్తున్నారని, వాహనాలను సిద్ధం చేయమని సిబంది కి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు లో రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.

## కొత్తపేటలో దాహం కేకలు

### - ఎంపీడీవో కార్యాలయం ముట్టడి

**కోటబొమ్మాళి, డిసెంబర్4(వార్త):** కోటబొమ్మాళి మండలం కొత్తపేట గ్రామంలో సుమారు నెల రోజులు నుంచి త్రాగునీటి సౌకర్యంలో లేక దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు బుధవారం పెద్ద ఎత్తున మహిళలు ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయ సూపరెండెంట్ మంగరాణికి తమ సమస్యలను విన్నవించుకున్నారు. 2019లో తమ పరిధిలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం పనిచేయటం లేదని లీకేజీలు ఏర్పడి నీరు వృధాగా పోతుందన్నారు. తమ పరిధిలో ఉన్న బోరుబావిలు వినియోగిస్తేంటే వాటి నుంచి వచ్చిన నీరు వాసన వచ్చి త్రాగలేకపోతున్నామని ఎన్ని సార్లు అధికారు దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేకపోతుందని వారు అవేదన వ్యక్తంచేశారు. త్వరితగతిన తమకు తాగునీటి సమస్య పరిష్కారాం కావాలని కోరారు. వెంటనే స్పందించిన మంగరాణి ఆర్ డబ్ల్యూఎస్ జెఈ తో మాట్లాడగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని వెళ్లి పరిశీలించగా మంచినీటి పథకంలీకేజి నీరు బయటకు పోతుందన్నారు. అందుకోసం మరమ్మతుల కోసం ఎస్టిమేట్ చేసి పంచాయతీకి నివేదిక అందించగా పంచాయతీకి అంత పెద్దమొత్తంలో నిధులు లేవని సమకూర్చలేమని అన్నారని చెప్పారు. ఈ విషయాన్ని ఎంపీడీవోకు తెలియజేసి మండల పరిషత్ నుంచి నిధులు సమకూర్చలని కోరుతానని సమాదానం ఇచ్చినట్లు మంగరాణి తెలిపారు. ఏదిఏమైన సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని అమె తెలిపారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Working Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546